సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలని నిరసన

ప్రజాశక్తి-కొమరాడ

భూమి ఆన్‌లైన్‌తో సంబంధం లేకుండా ప్రతిరైతుకూ వరి విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలని సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు కొమరాడలో ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడా వరి విత్తనాలు అందివ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. దీంతో ప్రయివేటు వ్యాపారుల వద్ద అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. వెంటనే రైతు భరోసా కేంద్రాల ద్వారా భూమి ఉన్న రైతులందరికీ సరిపడా విత్తనాలిచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు జి.సింహాచలం, ఎం.హక్కులనాయుడు, అప్పలనాయుడు, ఆదిబాబు, కృష్ణ, మధుసూదనరావు, గౌరునాయుడ, శివున్నాయుడు పాల్గొన్నారు.

బుడా ప్లాట్లు.. కొనేవారెవరు?

రాష్ట్రంలోనే అత్యంత ఆడంబరంగా ప్రారంభించిన జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌కి ఆదరణ కరువైంది. బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా) ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన రెండు లేఅవుట్లపైనా కొనుగోలుదారులు ఆసక్తి చూపడం లేదు. ప్లాట్ల విక్రయాలు ప్రారంభించి రెండు నెలలైనా 15 మందే దరఖాస్తు చేసుకోవడం అందుకు నిదర్శనం. రిజిస్ట్రేషన్‌కు నిబంధనలు గుదిబండగా మారడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం కారణంగా చెప్పొచ్చు. దీంతో ధర తక్కువైనా సరే.. చిరుద్యోగులు, వ్యాపారులు ముందుకు రావడం లేదు.

ప్లాట్లు విక్రయిస్తున్నది ఇక్కడే

- జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌కి ఆదరణ కరువు
- ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కి నిబంధనల గుదిబండ
- ప్రారంభించి రెండు నెలలైనా 15 మందే దరఖాస్తు
- మొగ్గుచూపని చిరుద్యోగులు, వ్యాపారులు
- మౌలిక సదుపాయాల కల్పనలో బుడా వైఫల్యం

ప్రజాశక్తి-సాలూరు

పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న సంకల్పంతో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లకు శ్రీకారం చుట్టింది. మధ్య తరగతి ఉద్యోగులకు, వ్యాపారులకు అందుబాటులో ఉండే విధంగా ప్లాట్ల అమ్మకాలు చేపట్టాలని నిర్ణయించింది. పట్టణ ప్రాంతాల్లో ప్రయివేటు రియల్ ఎస్టేట్ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఉద్యోగులు, వ్యాపారులు ఎగబడి ఆ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తున్నారు. కానీ ప్రభుత్వం మొట్టమొదటి సారిగా పట్టణానికి సమీపంలో బైపాస్ రోడ్డుకు ఆనుకుని బుడా ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన లేఅవుట్‌కు ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో ఆదరణ కనిపించడం లేదు. ప్లాట్ల అమ్మకాల ప్రక్రియ ప్రారంభించి రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు కనీసం 20 శాతం మంది కూడా రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. పట్టణ ప్రాంతంలో బుడా సంస్థ 14.87 ఎకరాల్లో రెండు లేఅవుట్లకు రూపకల్పన చేసింది. 29 మంది రైతుల నుంచి రూ.2.88 కోట్లతో భూమి కొనుగోలు చేసి ప్లాట్ల అమ్మకాలకు రంగం సిద్ధం చేసింది. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న లేఅవుట్‌లో 9.47 ఎకరాల్లో 109 ప్లాట్లు, దుగ్గసాగరం రోడ్డును ఆనుకుని ఉన్న లేఅవుట్‌లో 5.4 ఎకరాల్లో 75 ప్లాట్లు అమ్మకానికి పెట్టింది. డిప్యూటీ సిఎం రాజన్నదొర చేతుల మీదుగా లేఅవుట్లలో ప్లాట్ల అమ్మకాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే వెబ్‌సైట్ ని ప్రారంభించారు. 150, 200, 240 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్లాట్లను వర్గీకరణ చేశారు. జాతీయ రహదారి ఆనుకుని ఉన్న లేఅవుట్‌లో చదరపు గజం రేటు రూ.5 వేలు, దుగ్గసాగరం లేఅవుట్‌లో రూ.4,800గా బుడా నిర్ణయించింది. ప్రయివేటు రియల్ ఎస్టేట్ లేఅవుట్లతో పోలిస్తే బుడా సంస్థ రూపొందించిన లేఅవుట్లలో ప్లాట్ల ధరలు బాగా తక్కువే. కానీ ప్రజలు ముందుకు రాకపోవడం వెనుక కొన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జగనన్న స్మార్ట్‌టౌన్‌షిప్ బ్రోచర్

నిబంధనల గుదిబండ

రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత కొనుగోలుదారులు కొన్ని ధ్రువపత్రాలతోపాటు పది శాతం సొమ్ము చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు తమ ఆదాయం రూ.18 లక్షల లోపు ఉంటుందని ఫారం-16ని సమర్పించాలి. అదే వ్యాపారులైతే రూ.18 లక్షల లోపు ఆదాయం ఉంటుందని రెవెన్యూ అధికారితో ఆదాయ ధృవీకరణ పత్రం సమర్పించాలి. ఈ పత్రాల సమర్పణ చిరువ్యాపారులకు కొంత గుదిబండగా ఉంది.

మౌలిక సదుపాయాలేవీ

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్లలో ఇంతవరకు బుడా సంస్థ మౌలిక సదుపాయాల కల్పన కోసం చర్యలు చేపట్టలేదు. జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ పేరుతో అందమైన బ్రోచర్‌ని విడుదల చేసింది. కానీ దానిలో ఉన్న సౌకర్యాల కల్పనకు ఇంకా శ్రీకారం చుట్టలేదు. ప్రయివేటు లేఅవుట్లలో ఇంటర్నల్ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, పార్కు వంటి సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించి ప్రజలను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ బుడా లేఅవుట్లలో ఆ పరిస్థితి కనిపించడం లేదు.

వెంటాడుతున్న టిడ్కో గృహాల నీడ

టిడిపి ప్రభుత్వ హయాంలో సామాన్య, మధ్యతరగతి ప్రజల నుంచి టిడ్కో గృహాల నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం వివిధ కేటగిరీల్లో సొమ్ము వసూలు చేసింది. కొంతమంది మధ్యతరగతి ప్రజలు రూ.50 వేలు చొప్పున, మరికొందరు రూ.25 వేల చొప్పున టిడ్కో గృహాల కోసం ప్రభుత్వానికి చెల్లించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్ల నిబంధనలను పూర్తిగా మార్చింది. రూపాయి తీసుకుని పేదలకు ఇళ్లు కేటాయించాలని నిర్ణయించింది. టిడిపి ప్రభుత్వం హయాంలో చెల్లించిన సొమ్ములు ఏమయ్యాయో తెలియని అయోమయంలో లబ్ధిదారులున్నారు. ఆ డబ్బులు తిరిగి ఇస్తామని అధికారులు చెపుతున్నా నాలుగేళ్లుగా అది జరగడం లేదు. ఈ నేపథ్యంలో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ లేఅవుట్లలో ప్లాట్ల కోసం చెల్లింపు చేస్తే తమ డబ్బులకు గ్యారెంటీ ఉంటుందా? లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కారణాలతో మధ్యతరగతి ఉద్యోగులు, వ్యాపారులు స్మార్ట్‌టౌన్ షిప్ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు కోసం ముందుకు రావడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

గడువులోగా పూర్తిచేయాల్సిందే

రహదారి పనులపై ఇంజినీరింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-పాచిపెంట

రహదారుల నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పాచిపెంట మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో నిర్మిస్తున్న రహదారులను పరిశీలించేందుకు బుధవారం కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజనలో భాగంగా మండలంలోని కుంటాం నుంచి తుమ్మిగుడ్డి వరకు వయామెట్ట గుడ్డి మీదుగా అంచనా విలువ రూ.4.65 కోట్ల వ్యయంతో సుమారు 6.9 కిలోమీటర్లు, వేటగానివలస నుండి శతాబి మీదుగా అరకు రోడ్ కూడలి వరకు అంచనా విలువ రూ.9.97 కోట్ల వ్యయంతో సుమారు 14 కిలోమీటర్ల మేర ఆర్‌పిపిఎల్‌డబ్ల్యూవి కింద నిర్మిస్తున్న తారు రోడ్డు పనులను కలెక్టర్ పరిశీలించారు. రోడ్ నిర్మాణ వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంటాం నుంచి తుమ్మిగుడ్డి, వేటగానివలస రహదారుల నిర్మాణాలకు అవసరమైన అటవీ అనుమతులు లభించినందున నిర్దేశించిన సమయంలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కల్వర్టు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎం.వి.ఆర్.కృష్ణాజీని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి వీలైనంత త్వరగా ప్రజల రాకపోకలకు, రవాణా సౌకర్యాలు కలిగే విధంగా పూర్తిస్థాయిలో రహదారులను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం మండలంలోని బడ్నాయకవలస ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు కింద చేపడుతున్న మరమ్మతులను పరిశీలించారు. పాఠశాల తరగతి గదుల ఫ్లోరింగ్ పనులు, అదనపు తరగతి గది నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, తహశీల్దార్ ఎం.రాజశేఖర్, పంచాయతీరాజ్ శాఖ డిఇ డబ్ల్యూ.వి.శర్మ, ఎఇ బి.శంకర్ రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డి.రమణ రావు, తదితరులు, పాల్గొన్నారు.

కలెక్టర్ కారు అడ్డగింత

పాచిపెంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడలి వద్ద కలెక్టర్ కారును దళితులు అడ్డుకున్నారు. దళిత కాలనీలోని అంబేద్కర్ సామాజిక భవనాన్ని అమానుషంగా కూల్చివేశారని యువత కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సామాజిక భవనాన్ని కూల్చి, వేరే భవనం నిర్మిస్తున్నారని, ఆ పనులు చేపట్టనివ్వబోమని చెప్పారు. కూల్చిన భవనాన్ని పరిశీలించి, నివేదిక పంపించాలని తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు.

సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

పక్కాగా సోషల్ ఆడిట్

ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

ప్రజాశక్తి-కొమరాడ

సోషల్ ఆడిట్ పక్కాగా చేపట్టాలని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ తెలిపారు. కొమరాడ మండలంలో బుధవారం పర్యటించిన పిఒ.. ఎంపిడిఒ కార్యాలయంలో 16వ విడత ఉపాధి హామీ సోషల్ ఆడిట్ బహిరంగ విచారణను తనిఖీ చేశారు. ఉపాధి హామీ అమల్లో ఆదర్శంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఉపాధి హామీలో కూలీలకు అందుతున్న నగదు పనులకు సంబంధించిన తనిఖీలు పక్కాగా ఉండాలని ఆదేశించారు. సామాజిక తనిఖీలో అవినీతి జరిగినట్లు నిర్ధారణ అయితే తక్షణమే సిబ్బందిపై చర్యలు తీసుకుని రికవరీకి సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం మండలంలో 31 పంచాయతీల్లో 2022-23 ఏడాదికి సంబంధించిన జరిగిన ఉపాధి పనులు, పింఛన్లు, పంపిణీ తదితర అంశాలపై సామాజిక తనిఖీ గ్రామాల్లో ఇప్పటికే చేపట్టారు. గ్రామాల్లో డిఆర్‌పి ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో గ్రామసభలు ఏర్పాటుచేశారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించి, పంచాయతీల వారీగా బృంద సభ్యులు నివేదికలను చదివి వినిపించారు. అత్యధికంగా ఉపాధి హామీలో మస్తర్లు సక్రమంగా లేకపోవడం, సంతకాలు తేడా వంటి తప్పులు అధికంగా జరిగాయి. సామాజిక తనిఖీలో డ్వామా పీడీ రామచంద్రరావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఫనిస్, ఎపిఒ బాలకృష్ణ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-కలెక్టరేట్

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ కె.హేమలత హెచ్చరించారు. గర్భస్థ లింగ నిర్ధారణ నివారణపై డివిజనల్ స్థాయి సమీక్షా సమావేశం బుధవారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ మాట్లాడుతూ జిల్లాలో 33 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, తనిఖీ ప్రోగ్రాం అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. 1994 పిసి అండ్ పిఎన్‌టిడి చట్టానికి లోబడి స్కానింగ్ సెంటర్స్ పనిచేసేటట్లు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ చట్టానికి లోబడి పని చేయని సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆడ, మగ శిశువు నిర్ధారణ చేసిన స్కానింగ్ సెంటర్ల యజమానులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తారని తెలిపారు. బాలురు, బాలికల లింగ నిష్పత్తి పెంచేందుకు ప్రజల్లో అవగాహన కార్యక్రమం చేపట్టాలని సూచించారు. స్కానింగ్ సెంటర్లలో అధిక రుసుం వసూలు చేస్తే కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో న్యాయ, వైద్య, పోలీస్ శాఖల సమన్వయంతో సమావేశాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచడమే కాకుండా ప్రభుత్వం తరపున భరోసా కల్పిస్తున్నట్లు వివరించారు. స్కానింగ్ సెంటర్లు ఐదేళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలన్నారు. జిల్లాలో ప్రతి వెయ్యి మంది బాలురకు 850 మంది బాలికలు మాత్రమే ఉన్నారని, ఈ సంఖ్యను పెంచాలంటే స్కానింగ్ సెంటర్లపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ బి.జగన్నాథరావు, ఎడిఎంహెచ్ఒ జి.వెంకటరమణ, ఎస్ఐ ఫకృద్దీన్, డిఐఒ టి.జగన్మోహనరావు, డాక్టర్ శోభారాణి, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ హేమలత

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

గాలివాన బీభత్సం

నేలకొరిగిన చెట్టు, విద్యుత్తు తీగలు

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మండలంలోని మామిడిపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం, గాలులకు విద్యుత్తు తీగలు నేలకొరిగాయి. గ్రామం ప్రధాన రహదారిలో పెద్ద చెట్టు నేలకొరిగింది. తోణాం, కురుకూటి, కందులపదం వైపు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. గ్రామంలో విద్యుత్తు తీగలు తెగిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. రోడ్డుపైనే చెట్టు పడి పోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి.

కురుస్తున్న వర్షం

నెల్లిచెరువులో అక్రమ నిర్మాణాలపై పట్టదా?

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణ మెయిన్ రోడ్డుకు కూత వేటు దూరంలో ఉన్న నెల్లి చెరువులో అక్రమ కట్టడాలను ఎందుకు తొలగించడం లేదని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు జాగారపు ఈశ్వర ప్రసాద్ ప్రశ్నించారు. సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడుతో కలిసి బుధవారం నెల్లిచెరువులో అక్రమ కట్టడాలను, ఆక్రమణలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో ఉన్న నెల్లిచెరువు కబ్జాలకు గురవుతుంటే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. అధికారుల అండదండలతోనే కబ్జాదారులు రెచ్చిపోతున్నారన్న అనుమానం కలుగుతోందని తెలిపారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు

ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి-గరుగుబిల్లి

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సర్టిఫైడ్ విత్తనాలు, ఎరువులను పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి తెలిపారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో రూ.40 లక్షల నిర్మించిన సచివాలయాన్ని, రూ.26 లక్షలతో చేపట్టిన ఆర్‌బికెను బుధవారం ఆమె ప్రారంభించారు.

అనంతరం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయలేదని, వరిచేను కోత సమయానికి దెబ్బతినడంతో నష్టపోయేవారని చెప్పారు. రైతులు పండించిన పంటలకు మద్దతుధర కూడా ఇవ్వలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు సర్టిఫైడ్ విత్తనాలు, ఎరువులు ఇస్తూ పంట దిగుబడి అధికం చేస్తోందన్నారు. రైతులు గతంలో మండల కేంద్రానికి వెళ్లి ఎరువుల కోసం పడిగాపులు కాసేవారని, ప్రస్తుతం గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల వద్ద విత్తనాలు తీసుకోవచ్చని తెలిపారు. సచివాలయ వ్యవస్థతో గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి అరకు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు పరీక్షిత్‌రాజు, ఎంపిపి ఉరిటి రామారావు, గ్రామ సర్పంచ్ శెట్టి దివ్యలక్ష్మి, ఎంపిటిసి బి.గౌరమ్మ, ఎంపిటిసి జి.పైడితల్లి, తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

దారిదోపిడీకి డ్రైవరే సూత్రధారి

- నలుగురు నిందితులు అరెస్టు
- రూ 4.70 లక్షలు స్వాధీనం
- రూ. 45 లక్షలతో తప్పించుకు తిరుగుతున్న మరో నిందితుడు
- త్వరలో పట్టుకుంటాం : డిఎస్‌పి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని చోడమ్మ అగ్రహారం వద్ద 16వ నెంబర్ జాతీయ రహదారిపై గత నెల 30వ తేది అర్ధరాత్రి కారును అడ్డగించి దారిదోపిడీ చేసి రూ. 50 లక్షలు అపహరించిన దుండగులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాకుళం నుండి విశాఖ పట్నం రెండు బైక్ లపై వెళ్తుండగా వీరిని మండలంలోని కందివలస గెడ్డ వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రూ. 4.70 లక్షలతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మిగతా రూ. 45 లక్షలు మరో నేరస్తుడు వద్ద ఉన్నట్లు పట్టుబడ్డ నిందితులు పోలీసులకు చెప్పారు. ఆయన కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. అదుపులోకి తీసుకున్న నలుగురు నిందితులను బుధవారం కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి గోవిందరావు స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన కోట్ల వంశీకృష్ణ ధాన్యం, అపరాలు స్థానికంగా కొనుగోలు చేసి కాకినాడలో వ్యాపారికి అమ్మకం చేస్తుంటారు. విశాఖపట్నంకు చెందిన వరదరాజు అనే బ్రోకర్ ద్వారా లావాదేవీలు చేస్తుంటారు. ఎప్పటి లాగే అమ్మకం చేసిన ధాన్యానికి సంబంధించిన నగదును తీసుకొచ్చేందుకు గత నెల 30న వంశీకృష్ణ పర్లాకిమిడి నుండి విశాఖపట్నం బయలుదేరాడు. కారు నడిపేందుకు తనకు తెలిసిన జయరాం అనే డ్రైవర్‌తో కలిసి విశాఖ వచ్చారు. తరుచుగా వంశీకృష్ణ విశాఖపట్నం వస్తున్నప్పుడు జయరాంను డ్రైవర్‌గా తీసుకువస్తుంటాడు. జయరాం పర్లాకిమి డిలో ఆటో నడుపుతూ ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నాడు. తాను తరచూ విశాఖపట్నం నుండి లక్షలు రూపాయలు నగదును వంశీకృష్ణ అనే వ్యాపారితో కలిసి కారులో తీసుకొస్తుంటానని తన స్నేహితుడు మధు అనే మరో ఆటో డ్రైవర్‌కు జయరాం చెప్పాడు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడాలంటే ఈ సారి నగదుతో వస్తున్నప్పుడు ఎలాగైనా అపహరించాలని పథం వేసారు. వారితో పాటు మరో ముగ్గురు పర్లాకిమిడికి చెందిన ఆటో డ్రైవర్లు సంతోష్ పట్నాయక్, కుమారస్వామి, చింతాడ నరేంద్రను దోపిడీకి కుదుర్చుకున్నారు. గత నెల 30న డ్రైవర్ జయరాంకు వంశీకృష్ణ నుండి పోన్ వచ్చింది. విశాఖ వెళ్లి నగదు తీసుకువద్దామన్నాడు. వెంటనే విషయం జయరాం తన స్నేహితులకు తెలిపాడు. కారు వెనుక పర్లా కిమిడి నుండి రెండు బైక్‌లపై మధుతో పాటు మరో ముగ్గురు విశాఖపట్నం వచ్చారు. రాత్రి 11 గంటల సమయంలో రూ. 50 లక్షలు పట్టుకొని విశాఖ నుండి పర్లా కిమిడికి బయలు దేరారు. ఈ విషయాన్ని డ్రైవర్ జయరాం తన గ్యాంగ్‌కు చెప్పాడు. తాము నాతవలస టోల్ గేటు వద్ద రాత్రి 12 గంటల సమయంలో టీ తాగేందుకు కారు ఆపుతామని చెప్పాడు. అక్కడి నుంచి బయలు దేరిన తరువాత ఎక్కడ చీకటి ఉంటే అక్కడ కారుకు అడ్డంగా వచ్చేయాలని చెప్పాడు. చెప్పినట్లే రాత్రి 12 గంటల సమయంలో నాతవలస టోల్ గేటు వద్ద టీ తాగారు. అనంతరం బయలుదేరి వెళుతుండగా చోడమ్మ అగ్రహారం బ్రిడ్జిపై కారుకు అడ్డంగా బైక్‌లు పెట్టి కారు ఆపారు. యజమాని వంశీకృష్ణ కారు అద్దాలు తీయవద్దని చెప్పినా డ్రైవర్ జయరాం అద్దాలు దించేసాడు. వెంటనే వారు కారులో చెయ్యిపెట్టి రూ. 50 లక్షలు బ్యాగును ఎత్తుకుపోయారు. కొంత సేపు అటు ఇటూ తిరిగి వంశీకృష్ణతో పాటు డ్రైవర్ జయరాం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసు బృందాలు రంగంలో దిగాయి. డ్రైవర్ ప్రవర్తనపై అనుమానం రావడంతో సెల్ కాల్స్ పరిశీలించారు. డ్రైవర్ తో పాటు నలుగురు దుండగలు ఫోన్ సంభాషణలను బట్టి కేసును చేధించగలిగారు. రూ. 50 లక్షలు దోపిడీ చేసిన వీరు నలుగురు వెంటనే విజయనగరం చేరుకున్నారు. అక్కడ మధు అనే వ్యక్తి ముగ్గురికి రూ. 5 లక్షలు ఇచ్చి పర్లాకిమిడి వెళ్లిపోమన్నాడు. వారంతా బైక్ పై రూ.5లక్షలు పట్టుకొని పర్లా కిమిడి వెళ్లిపోయారు. పూసపాటి రేగ పోలీసులకి ఫిర్యాదు ఇచ్చిన కొంత టైం లోనే డ్రైవర్ కూడా పోలీసుల నుండి తప్పించుకున్నాడు. నేరస్తులంతా పర్లా కిమిడిలో కలుసుకొని పోలీసులు తమ గ్రామాల్లో విచారణ చేస్తున్నారని రెండు బైక్‌లపై విజయవాడ వెళ్లేందుకు ప్రయాణమయ్యారు. బుధవారం ఉదయం కందివలస గెడ్డ వద్ద వీరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుండి రూ. 4.70 లక్షలు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు బైక్ లు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు మధు కోసం గాలిస్తున్నారు. మిగతా రూ. 45 లక్షలు మధు దగ్గర ఉందని, త్వరలో అతడిని పట్టుకుంటామని డిఎస్‌పి తెలిపారు. కేసు ఛేదనలో సిసిఎస్ సిఐ ఎం. బుచ్చిరాజు, విజయనగరం టూ టౌన్ సిఐ సిహెచ్ లక్ష్మణరావు ప్రత్యేక చొరవ చూపించారన్నారు. పూసపాటిరేగ ఎస్ఐ ఎ.నరేష్, సిసిఎస్ ఎస్ఐ సాగర్ బాబు, క్రైమ్ కానిస్టేబుల్ దామోదర్ తదితరులు కీలకంగా వ్యవహరించారని తెలిపారు.

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి గోవిందరావు

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలి

వీరఘట్టం : మండలంలోని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను స్వదినియోగం చేసుకోవాలని తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ ప్రజలను కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలోనే ఆధార్ కేంద్రంతోపాటు సచివాలయం-1, 3, పనస నందివాడ, వండువ, కత్తులకవిటి గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వద్దు : పిఒ

ప్రజాశక్తి-కొమరాడ

ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ హెచ్చరించారు. బుధవారం కొమరాడ మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా విధులకు గైర్హాజరవుతున్న వైద్యులు, ఉద్యోగులు, సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రి ఒపి, పలు రికార్డులను పరిశీలించారు. ఉద్యోగులకు సంబంధించిన ఆన్‌లైన్ హాజరు విధానం మొబైల్ యాప్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి, గ్రామాల్లో ఉన్న ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వైద్య సేవలు అందడంలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. విధులకు సక్రమంగా హాజరుకాని వైద్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి గ్రామంలో నెలలో రెండుసార్లు వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం సోమినాయుడువలసకు చెందిన రైతు విద్యుత్ మోటార్ అవసరమని గతంలో వినతి అందించడంతో, ఆ రైతుకు సంబంధించిన భూమిని పిఒ పరిశీలించారు. మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు.

గంటందొర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

గంటందొర పోరాటపటిమ మరువలేనిది

నివాళులర్పించిన డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి-సాలూరు

బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో గంటందొర చూపిన పోరాట పటిమ మరువలేనిదని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. బుధవారం గంటందొర వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ తెల్లదొరల గుండెల్లో రైళ్లు పరుగెత్తించేందుకు అల్లూరి సీతారామరాజు వదిలిన గిరిజన బాణం గంటందొర అన్నారు. నాడు మన్యంలో గిరిజనుల అణచివేతకు నిరసనగా పోరాడిన యోధుడు గంటందొరని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, పట్టణ మాజీ అధ్యక్షుడు జర్జాపు సూరిబాబు, మున్సిపల్ జెసిఎస్ కన్వీనర్ గిరి రఘు, కౌన్సిలర్లు పప్పల లక్ష్మణరావు, గొర్లి వెంకటరమణ, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో చక్కని ఫలితం

ప్రజాశక్తి-సీతానగరం

దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేద మందులతో చక్కని ఫలితం ఉంటుందని బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి టి.హేమాక్షి అన్నారు. పెదంకలాం గ్రామంలో నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరంలో వంద మందికి పైగా డాక్టర్ వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ముఖ్యంగా శ్వాసకోశ వ్యాధులకు, వాతం, జీర్ణకోశ సంబంధిత వ్యాధులకు పరీక్షలు చేశార. అనంతరం ఆయుర్వేద వైద్య ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయుర్వేద మందులు వాడటం వల్ల ఎటువంటి దుష్పరిణామాలు ఉండవని, ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. పూర్వ కాలం నుండి ఆయుర్వేదానికి ప్రాధాన్యత ఉందన్నారు. యోగాపై అవగాహన కల్పించి, సిబ్బందితో పలు ఆసనాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిపి బలగ శ్రీరామ్మూర్తి, సర్పంచ్ బలగ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పద్మ, రూప, నాగరాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలి

సిఐ సత్యనారాయణ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గిరిజనులు చిల్లంగి, చేతబడి వంటి మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ సూచించారు. మండలంలోని బాలేసు గ్రామాన్ని బుధవారం సందర్శించి, గిరిజనులతో సమావేశమయ్యారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలు చైతన్యవంతులు కావాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో నేటికీ మూఢనమ్మకాలతో ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడుతూ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. దిశ యాప్ ప్రతిఒక్కరూ వినియోగించాలని, ఆపదలో రక్షణ కవచంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ప్రజారోగ్య పరిరక్షణపై వ్యాపారులు అవగాహన పెంచుకోవాలని జిల్లా ఆహార భద్రతాధికారి వై.రామయ్య అన్నారు. జిల్లా ఆహార భద్రత, ప్రమాణాల శాఖాధికారి కార్యాలయంలో ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార ప్రమాణాలు - జీవితాన్ని కాపాడుతాయని చెప్పారు. ఆహార పదార్థాల నాణ్యత చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంస్థలు నిర్దేశించిన నిబంధనలు పాటించాలని, ప్రతి ఆహార తయారీ సంస్థ విధిగా లైసెన్సులు కలిగి ఉండాలని స్పష్టంచేశారు. నీటి వినియోగం, పాత్రలను శుభ్రం చేయడంతో సహ ప్రతి అంశంలో స్పష్టమైన ప్రమాణాలు పాటించి, వినియోగదారుల ఆహార, ఆరోగ్య రక్షణలో రాజీ పడకుండా ఉండాలని తెలిపారు. ఆహార భద్రతాధికారి పి.వెంకట రమణ ఆహార భద్రత గురించి తెలియజేశారు. ఈ సమావేశంలో వర్తక సంఘం, హోటల్, ఇతర వ్యాపార నిర్వాహకులు హాజరయ్యారు.

లాటరీ తీస్తున్న ప్రిన్సిపల్ నాగభూషణం

మినీ గురుకులాల్లో ప్రవేశాలకు లాటరీ

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట, శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలంలో ఉన్న కారిగూడ మినీ గురుకులాల్లో ప్రవేశాలకు స్థానిక బాలుర కళాశాలలో బుధవారం ప్రిన్సిపల్ పి.నాగభూషణం ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించారు. 120 సీట్లకు 500 పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఒకటి నుండి ఏడో తరగతి వరకు మినీ గురుకులాల్లో విద్యాభ్యాసం పొందుతారు. ఈ కార్యక్రమంలో పెద్దమడి ప్రిన్సిపల్ రేణుకేశ్వరరావు, మినీ గురుకులం ప్రిన్సిపల్ హేమలత, గురుకులం సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిమ్మిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కిమ్మి గ్రామంలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి రోగులకు తనిఖీలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అంతకుముందు గ్రామంలోనే అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ నిర్వహించారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని అంగన్వాడీ కార్యకర్తను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శాంతకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ ప్రారంభం

విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురం గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు రాయితీపై విత్తనాలు, ఎరువుల పంపిణీని ప్రారంభించారు. సర్పంచ్ చెరుకుపల్లి బంగారమ్మతో కలిసి విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్‌బికెల ద్వారా రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఖరీఫ్ సీజన్‌కి అవసరమయ్యే ఎరువులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. నిబంధనల ప్రకారం రైతులందరికీ రాయితీపై పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపి సిద్ధా జగన్నాథరావు, నాయకులు కాపరపు సత్యనారాయణ, గురురాజు, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని కిమ్మి గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో బుధవారం విఎఎ పి.చిన్నారావు ఆధ్వర్యంలో విత్తనాలు పంపిణీ చేశారు. 1064 రకం 30 కిలోలు రూ.850 చొప్పున రైతులకు విత్తనాలు సరఫరా చేశారు.

నవధాన్యాల కిట్లు పంపిణీ

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని తాడికొండ ఆర్‌బికెలో 35 మంది, లుంబేసు ఆర్‌బికెలో 30 మంది రైతులకు నవధాన్యాల కిట్లను ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌ఛార్జి ఎం.సీతారాం బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు అనుకూలంగా ఉండడం వల్ల రైతులు తమ వద్ద 20 నుంచి 30 రకాల విత్తనాలను కలిపి ఒక కిట్టుగా చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. తొలకరి వర్షాలకు ముందుగా పొలంలో వేసుకోవడం వల్ల భూమి సారవంతం అవడంతోపాటు ప్రధాన పంటలకు అవసరమైన అన్ని రకాల సూక్ష్మ, స్థూల పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని చెప్పారు. దీనివల్ల ఏ విధమైన రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకం లేకుండా ఖర్చులు తగ్గుతాయన్నారు. పంటల దిగుబడులు పెరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో విఎఎలు నవీన్ , సాయిరాం, కార్యకర్తలు ,రైతులు పాల్గొన్నారు.

విడివికె కేంద్రాలను పరిశీలిస్తున్న పిఒ కల్పనకుమారి

విడివికెల పనితీరు మెరుగుపడాలి

ఐటిడిఎ పిఒ కల్పన కుమారి

ప్రజాశక్తి-సీతంపేట

విడివికెలు నిరంతరం పనిచేయాలని, వాటి పనితీరు మెరుగుపరచాలని ఐటిడిఎ పిఒ కల్పన కుమారి అన్నారు. బుధవారం సీతంపేట మండలంలోని దిబ్బగూడ, కీసరజోడు విడివికెలను పిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ విడివికెల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. విడివికెల ద్వారా ఉత్పత్తి అయ్యే వస్తువులకు మార్కెటింగ్ సదుపాయం కలిస్తామన్నారు. విడివికెల ద్వారా ఎక్కువ మోతాదులో ఉత్పత్తి జరగాలన్నారు. ఈ సందర్భంగా విడివికె సిబ్బందితో పిఒ నేల మీదే కూర్చొని మాట్లాడారు.

విడివికెల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం

విడివికెల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అధికారులను ఆదేశించారు. ఐటిడిఎలో వైకెపి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎపిఎంలు నిరంతరం క్షేత్ర స్థాయిలో విడివికెలను సందర్శించాలన్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల పీడీలు డి.విద్యాసాగర్, కిరణ్ కుమార్, ఎపిడిలు బి.వి.రమణ, నారాయణరావు, జిసిసి డిఎం సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

మినీ మేనిఫెస్టోతో వైసిపి బెంబేలు

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

మహానాడులో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు విడుదల చేసిన మినీ మేనిఫెస్టో చూసి వైసిపి నాయకులు బెంబేలెత్తిపోతున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి అన్నారు. బుధవారం ఆమె నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టో ట్రైలర్ మాత్రమేనని, వైసిపి నాయకులకు అసలు సినిమా ముందు చంద్రబాబు చూపిస్తారని చెప్పారు. ఈ నెల పది నుంచి మేనిఫెస్టోపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మండల అధ్యక్షులు జి.వేణుగోపాల్, ఎం.సూర్యనారాయణ, పట్టణ నాయకులు కొనిసి చిన్ని, మండల నాయకులు యుగంధర్ పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : ప్రజల బంగారు భవిష్యత్తు కోసం అనునిత్యం శ్రమించేది టిడిపియేనని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. బుధవారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుతో కలిసి ఆయన మాట్లాడారు. మహానాడులో విడుదల చేసిన

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ జగదీష్

మేనిఫెస్టోలోని కొన్ని అంశాలు వైసిపికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను నిలపుదల చేస్తారని ప్రచారం చేసిన అధికార పక్షం చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోకు ఎంతో ఆదరణ లభించిందన్నారు. ఈ పథకాలపై పూర్తిగా అవగాహన పెంచుకొని ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు జి.రవికుమార్, డి.మోహన్‌రావు, కౌన్సిలర్లు టి.వెంకట్రావు, బడే గౌరినాయుడు, కోలా సరిత, మధుసూదన్‌రావు, నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, ఉదయభాను, కొల్లి తిరుపతి, జాగాన రవికుమార్, బోను చంద్రమౌళి, సిరిపురపు భాస్కరరావు, పాలకొండ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు.. తొలగించారు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

చెట్టుకొమ్మలను తొలగిస్తున్న కార్మికులు

పట్టణంలోని టిఆర్ఎంఎం పాఠశాల ఎదుట రోడ్డుపై చెట్ల కొమ్మలను వదిలేయడంపై బుధవారం 'ప్రజాశక్తి'లో వచ్చిన 'వీటిని తొలగించండి సారూ' అనేక కథనానికి మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు స్పందించారు. కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజారోగ్య అధికారి సిబ్బందితో రహదారిపై ఉన్న చెట్టుకొమ్మలను తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలే అజెండా

ఎంపిపి శెట్టి పద్మావతి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి పద్మావతి

ప్రజాశక్తి - కురుపాం

ప్రజా సమస్యలే ఆజెండాగా అధికారులు పనిచేయాలని ఎంపిపి శెట్టి పద్మావతి సూచించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంతో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు విద్యుత్తు, తాగునీటి సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఉదయపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల గేటు బిగించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పరిష్కరించడం లేదని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపిపి పద్మావతి జోక్యం చేసుకుని, సమస్య ఏ శాఖదైతే ఆ శాఖ సిబ్బంది కచ్చితంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యలే ఆజెండాగా పనిచేస్తూ మండలాన్ని ప్రగతి పథంలో నడపాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివరామప్ప, తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ జిలానీ, మండల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-సీతంపేట

చింతమానుగూడలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన గిరిజనుడు సవర బాపయ్యను ఐటిడిఎ ఆదుకోవాలని టిడిపి నాయకులు పడాల భూదేవి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆపదలో ఉన్న గిరిజనులకు ఆదుకొనేందుకే ఐటిడిఎ ఉందని గుర్తుచేశారు. బాధితుడు ఐటిడిఎ స్పందనను ఆశ్రయించినా, ఇప్పటివరకు ఉలుకూ పలుకు లేదని విమర్శించారు. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం చూస్తే గిరిజనులను ఎంత చులకనగా చూస్తున్నారో అర్థమవుతుందని ఆవేదన వ్యక్తంచేశారు.

నేరాలు ఘోరాలు

వివరాలు సేకరిస్తున్న సిఐ ధనంజయరావు, ఇన్‌సెట్‌లో దాలయ్య (ఫైల్ ఫొటో)

స్థల వివాదంలో కొట్లాట

ఒకరు మృతి

ప్రజాశక్తి-పాచిపెంట

ఇంటి స్థల వివాదంలో జరిగిన కొట్లాటలో ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన పాచిపెంటలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... పాచిపెంటలోని కూరాకుల వీధిలో ఇంటి స్థలం విషయంలో మంగళవారం ఇరుగ్రూపులచ మధ్య కొట్లాట జరిగింది. ఈ ఘటనలో తూముల దాలయ్య (70)కు తీవ్ర గాయాలు కావడంతో విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి పరిస్థితి విషమించి ఆయన మృతిచెందాడు. దాలయ్య కుమారుడు తూముల వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఘటనా స్థలానికి సాలూరు సిఐ దనంజయరావు వెళ్లి, వివరాలు సేకరించారు. ఒక గ్రూపునకు చెందిన తొమ్మిది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అధిక దిగుబడికి విత్తనమే పునాది

ప్రజాశక్తి-పాచిపెంట

నాణ్యమైన విత్తనం వినియోగిస్తేనే అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. బుధవారం మండలంలోని మాతుమూరు, కర్రివలస, పి.కోనవలస, పనుకువలస, గురువునాయుడుపేట, కోటికిపెంట, విశ్వనాథపురం రైతు భరోసా కేంద్రాలలో విత్తన మొలక శాతం పరీక్షలు నిర్వహించారు. మాతుమూరు, కోటికిపెంట రైతు భరోసా కేంద్రాల్లో విత్తన మొలక శాతం పరీక్షలను సమీక్షిస్తూ విత్తన చట్టం -1966 ప్రకారం ప్రతి పంటకు మొలక శాతం నిర్ధారణ చేసుకోవాలని చెప్పారు. ఆ తదుపరి మాత్రమే విత్తన పంపిణీ చేపట్టాలన్నారు. వరి విత్తనానికి 80 శాతం, మొక్కజొన్నకు 90 శాతం, పత్తికి 75 శాతం, అపరాల పంటలకు 75 శాతం, వేరుశనగకు 70 శాతం, నువ్వులకు 80 శాతం మొలక తప్పనిసరిగా రావాలని తెలిపారు. ప్రస్తుతం ఎపి సీడ్స్ ద్వారా ఇస్తున్న వరి విత్తనాలకు 90 శాతం పైగా మొలక వచ్చిందన్నారు. రైతులు ఎకరానికి 20 కిలోలు నారు పోసుకుంటే సరిపోతుందన్నారు.

విత్తనాలలో న్యూక్లియస్ సీడ్, బ్రీడర్ సీడ్, ఫౌండేషన్ సీడ్, సర్టిఫైడ్ లేదా ట్రూత్ ఫుల్లీ లేబుల్ సీడ్ ఉంటాయని, అన్ని రకాల విత్తనాలకు జన్యు స్వచ్ఛత 99 శాతం పైగా ఉండాలని తెలిపారు. అదును చూసుకొని మాత్రమే విత్తనాలను నాటుకోవాలని, లేకుంటే మొలక శాతం దెబ్బతింటుందని చెప్పారు. నాణ్యమైన వితనాన్ని వాడకుంటే మొత్తానికి సీజన్ కోల్పోయినట్లు అవుతుందన్నారు. రైతులు తప్పనిసరిగా మొలక శాతం పరీక్షలు చేయించుకున్న తర్వాతే విత్తనాలు నాటుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి గ్రామ అధ్యక్షులు శనగల సింహాచలం, విఎఎ, రైతులు , తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే వేగవంతం

రీసర్వేపై ఆరాతీస్తున్న జెసి గోవిందరావు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భూముల రీసర్వే సకాలంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ గోవిందరావు.. రెవెన్యూ అధికారులకు సూచించారు. మండలంలోని ఎగువతాడికొండ గ్రామంలో చేపడుతున్న భూ రీసర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇప్పటివరకు మండలంలో ఎంత భూమి రీ సర్వే అయింది, ఇంకా ఎంత మిగిలి ఉంది? అనే విషయాలను తహశీల్దార్ రాములమ్మను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఎంపిడిఒ సాల్మన్ రాజు, తాడికొండ సర్పంచ్ జగ్గారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో జీవన ప్రమాణాలు మెరుగు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

సంక్షేమ పథకాల ద్వారానే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బుధవారం పట్టణంలోని 26, 29 వార్డుల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కుసుమ గుడ్డి వీధిలోని ఆంజనేయ స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గడపగడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఎవరికైనా సమస్యలుంటే వాటిని సైతం కనుక్కొని వాటి పరిష్కారానికి వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇందుపూరు గున్నేశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయబాబు, ఎఎంసి వైస్ చైర్మన్ వి.శంకర్రావు, కౌన్సిలర్ ఎడ్ల త్రినాథ, ఆర్.చిన్నంనాయుడు, ఆర్.బంగారునాయుడు, ఎన్.సుధీర్, కోరాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బైక్, ఆటో ఢీ

ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్, సీతానగరం

మృతిచెందిన పవన్‌తేజ్

సీతానగరం మండలం అప్పయ్యపేట ఫ్లై ఓవర్ డౌన్‌లో బుధవారం ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొంది. ఈ సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. అందులో జీలకర్ర పవన్ తేజ్ (20) మతి చెందాడు. బక్కుపేటకు చెందిన గంట దుర్గాప్రసాద్, జీలకర్ర పవన్ తేజ్ పెళ్లి సరుకులు కొనే నిమిత్తం స్నేహితుడి బైక్‌పై పార్వతీపురం వెళు తున్నారు. అప్పయ్యపేట సబ్‌స్టేషన్ ఎదురుగా పార్వతీపురం నుండి రామభద్రపురం ప్రయాణికులతో వస్తున్న ఆటో.. బైక్‌ను బలంగా ఢీకొంది. బైక్‌పై ఉన్న ఇద్దరి యువకులతోపాటు ఆటో డ్రైవర్ కొమ్మనాపల్లి భాస్కరరావు, యాళ్ల ఈశ్వరమ్మ అనే ప్రయాణికురాలు గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి పవన్ తేజ్ మృతి చెందాడు. మిగతా వారికి చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో హడ్డుబంగి పంచాయతీ మెట్టుగూడలో ఉపాధి హామీ ద్వారా నిర్వహిస్తున్న టెర్రసింగ్ పనులను బుధవారం ఎంపిడిఒ కొండపల్లి సత్యం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. అర్హులందరికీ జాబ్ కార్డులు పంపిణీ చేయాలన్నారు. తాగునీరు, ప్రథమ చికిత్స పెట్టె తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సకాలంలో కూలీలకు వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని గుచ్చిమి, తానసీతారాంపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ ఎంఎల్ఎన్ఎస్ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు సమయపాలన పాటించాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. పనిప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం పట్టణం బైపాస్ రోడ్‌లో పెనుప్రమాదం తప్పింది. ఒడిశా నుండి విశాఖపట్నం వెళ్తున్న లారీ బైపాస్ రోడ్డు మలుపు వద్ద ఉన్న హై టెన్షన్ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం నేలకొరిగింది. బుధవారం తెల్లవారుజామున ఈ సంఘటన జరగడం, ఆ సమయంలో ఆ రహదారిపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. ప్రాణనష్టం జరగలేదు. స్తంభం నేలకొరగడంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. పునరుద్ధరణ పనులు చేపడుతున్నట్లు ఎఇ రామారావు తెలిపారు.